



ఆ మర్నాడు పొద్దున్నే ట్రెయిన్‌కి వెళ్ళడానికి రెడీ అవుతోన్న రజితకి - ఎంత అపుకుందామనుకున్నా కన్నీళ్ళు ఆగలేదు.

" ఏయ్ పిచ్చిమొద్దూ ! మొగుణ్ణి విడిచి పుట్టింటికి వెళ్తున్నట్లు ఏమిటే ఆ కన్నీళ్ళు?" అంది జయ నవ్వించడానికి ప్రయత్నిస్తూ .

" నీ ఉపమానం బాగాలేదే! మొగుణ్ణి విడిచి పుట్టింటికి వెళ్ళే వాళ్ళకయినా మళ్ళీ వాడి దగ్గరకు వచ్చే అదృష్టముంటుంది. కాని మనకు అది ఎక్కడిదే?"

"ఏం, మళ్ళీ రావేమిటీ?"

"వచ్చినా - వాడిలా శాశ్వతంగా ఒకరి దగ్గర మరొకరంఉండిపోతామా? ఎప్పటికైనా విడిపోవాల్సిందే కదా ! అందుకే... ఈ బాధని, ఈ తీయని భాధని భరించలేం జయా" అంది రజిత.

రజితని రిక్షాలో పంపించి, తనుకూడా బట్టలవీ సర్దుకుంది జయ. అందరినీ పంపించాకే - తను బయల్దేరాలనే వుద్దేశ్యంతో - రజితనీ, నిర్మలనీ, చేగోడినీ.. అలా అందర్నీ పంపించాక చివరగా తనూ బయల్దేరింది !

బస్టాండ్ చేరే సరికి వరంగల్ బస్ మిస్సయింది. టైమ్ చూసుకుంటే పన్నెండవు తోంది ! ఇంకో బస్సు రెండు గంటలక్కానీ లేదు. వరంగల్ చేరేసరికి రాత్రి ఏడవుతుంది ! ఫర్వాలేదు ! తమ అందుకోవాల్సిన బస్ అక్కడినుంచి ఏడున్నరకి బయల్దేరుతుంది కాబట్టి తను సకాలంలోనే చేరుతుంది అని అనుకుంది. అయితే అనుకున్నట్టుగా ఏడు గంటలక్కాక ఆ బస్ మరో గంట లేట్‌గా వరంగల్ చేరుకుంది. బస్ కంట్రోలర్‌ని అడిగి చూస్తే తను వెళ్ళే బస్ అయిదు నిమిషాల క్రితమే వెళ్ళి పోయిందనీ, అదే లాస్ట్ బస్ అని చెప్పాడు ! జయ గుండెలో రాయిపడింది. ఇప్పుడెలా? ఎక్కడికని వెళ్ళేది? తనకు తెలిసిన వాళ్ళెవరూ లేరు. ఈ కష్టాన్ని తనెలా గట్టెక్కేట్టు? తొందరపడి బయల్దేరకుండా ఒకటికి రెండు సార్లు ఆలోచించి వుంటే - ఈ దుర్గతి పట్టేది కాదుగా - ఆలోచిస్తొన్న జయకి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగి చెంపల మీదుగా జారి కింద పడ్డాయి. ఎవరైనా చూశారేమోనని సిగ్గుపడి తుడుచుకుంది.

ఇదంతా ఆమెకి తెలీకుండా దూరాన్నుంచి గమనిస్తోన్న ఓ యువకుడు "ఎక్కడికి వెళ్ళాలండీ" అంటూ వచ్చాడు.

చెప్పింది జయ.

" బస్ ఇప్పుడే వెళ్ళిపోయింది! ఎలా ? ఏంచేస్తారు ? ఇంతకీ మీవూరు ఇక్కడికి ఎన్ని మైళ్ళుంటుంది ?"

"ముప్పయి వుండవచ్చు!"

"ఐసీ - దెన్ ఇట్స్ బెటర్ టు గో బై టాక్సీ"

" టాక్సీలోనా ? ఇంతరాత్రి - ఒంటరిగా ! ఉహూఁ వెళ్ళలేనండీ," కళ్ళల్లో భయం.

"మరెలా?!" ఒంటరిగా వెళ్ళడానికి భయమైతే అక్కడిదాకా వచ్చి దిగబెట్తానని చెప్దామనుకున్నాడు... అతడు.

కానీ - ఆమె ఎక్కడ అపార్థంచేసుకుని తనను అనుమానిస్తుందో అనే అభిమానంతో ఆ మాట చెప్పడానికి సాహసించలేక పోయాడు.

"మీకు పరిచస్తులేవరూ లేరా ఈ ఊళ్ళో?"

" అయ్యా, పాపన్న గారూ! మీ పరోపకారానికి థాంక్స్ ! పరిచయస్తులంటూ వున్నాక.... మీతో ఇలా హస్కీ వేస్తూ కూర్చునే ఖర్మేమిటండీ నాకు!"

అంది జయ అసహనంగా.

అసలే ప్రయాణంలో అలిసి పోయిందేమో, అతడి మాటలు అధిక ప్రసంగంలా తోచాయి ఆమెకి.

అతడికి మాత్రం ఆమె చిరాకును చూసి నవ్వొచ్చింది !

“ చూడండీ, మీరేమనుకోకపోతే నాదో సలహా !”

మౌనంగానే వుండిపోయింది జయ.

“ ఇక్కడ మెడికల్ కాలేజీ హాస్టల్లో మా బంధువుల అమ్మాయి వుంది ! మీకు అభ్యంతరం లేకపోతే - ఈ రాత్రి అక్కడ అమెకి గెస్ట్‌గా వుండి, రేపు ఉదయం వెళ్ళి పోదురుగానీ...”

పోయిన ప్రాణాలు లేచివచ్చాయి జయకి !

“థాంక్స్ ! ఆ వూహే తట్టలేదు.” అంటూ రిక్షాని పిలిచింది. అప్పటిదాకా ఆమె ముఖంలో కన్పించిన ఆందోళన మాయమై సంతోషం గంతులేసింది.

రిక్షాలో కూర్చుని అతడి వైపు తిరిగి “మీమేలు మరిచిపోను” అంటూ “ కాకతీయ మెడికల్ కాలేజీకి పోనీయ్ !” అంది.

రిక్షా కదలబోతూండగా “ఏమండోయ్ ! మీరు ఉత్త తొందర మనుషుల్లా వున్నారు! మా కజిన్ వూరూ, పేరూ తెలుసుకోరా ఏమిటీ ? ఆ అమ్మాయి పేరు లీల, మెడిసిన్ నాలుగో సంవత్సరం ! మీ వినోద్ అన్నయ్య ఫ్రెండ్‌నని చెప్పండి చాలు ! మిమ్మల్ని బాగా రిసీవ్ చేసుకుంటుంది.” చెప్పాడతడు.

“ ఓ... మీ పేరు వినోద్ అన్నమాట ! సారీ, నా పేరు చెప్పనేలేదు ! నన్ను ‘జయ’ అని పిలుస్తారు ! ఇక వెళ్ళొస్తాను - బై” జయ.

రిక్షా కదిలింది. వినోద్ హృదయంలో అలజడి చెలరేగింది.

❋❋❋❋❋❋

ఆ తర్వాత వారం రోజులకి రజిత నుండి లెటరొచ్చింది జయకి.

**ప్రియసఖీ జయా,**

ఎలా వున్నావ్?

ఇక నా సంగతి చెప్పమంటావా? ఏం చెప్పమంటావ్ ?

‘నీ ఆలోచన లేనిదే నేను బ్రతకలేను, నీ వూహలు నాలో రానీకుండా క్షణం కూడా ఊపిరి తీయలేను’ అని రాస్తే బొత్తిగా కథల్లోని డైలాగ్స్‌లా - ప్రేయసీ ప్రియులమాటల్లా వుంటాయేమో !?

నిజానికి నువ్వు లేని బ్రతుకునిరర్థకమే అయినా - ఆమాట పైకి అంటే నన్నో పిచ్చిదాని కింద జమకడ్తారు లోకులు! అందుకని నీపట్ల నాలో చెలరేగే భావాలని అటు ఎవరికీ చెప్పుకోకుండా, ఇటు హృదయంలో దాచుకుని మధనపడే శక్తీ లేకా - ఇన్ని రోజులూ ఎంత బాధను అనుభవించానో తెలుసా ?

నేనొచ్చానని తెలిసి నిన్న వరంగల్ నుంచి అన్నయ్య వచ్చాడు ! వాడు వచ్చాక గానీ - నేను మామూలు మనిషిని కాలేక పోయాను ! వాడికి నీ కబుర్లు చెప్పడంతోనే గడిచిపోయాయి ఈ రెండు రోజులూ మనం తీసుకున్న ఫోటోలు కూడా చూపించాను.

నీ ఫోటో చూసి ‘ఈవిడ పేరు జయ కదూ ?’ అని అడిగాడు.

"అరె .... నీకెలా తెలుసు ?" అడిగాను ఆశ్చర్యంగా.

మొన్న నీకు బస్ మిస్సయితే, నిన్ను మెడికల్ కాలేజీ హాస్టల్‌కి పంపించాడట కదా - విషయమంతా చెప్పాడు.

నువ్వుత్త వెర్రి ముఖానివి కాకపోతే అంత పొద్దుపోయాక - తీరిగ్గా బస్సెక్కు తావుటే!? సమయానికి అన్నయ్య సాయం చేశారు కాబట్టి సరిపోయింది - లేకపోతే ఏమయ్యేది!?

అద్సరేగానీ నీ ఫోటో చూశాక వాడు నీ కబుర్లు ఎంత ఉత్సాహంగా విన్నాడనుకున్నావ్? మొత్తానికి నువ్వు వాణ్ణి భలే ఆకర్షించావు !

ఓ వంక విసుగూ, విరామం లేకుండా మన కబుర్లు నేను చూప్తూనే వున్నానా.... వాడు ఏమాత్రం బోర్ ఫీలవకుండా ఎంతో ఆసక్తిని కనపరుస్తూ మధ్య మధ్య నీ గురించి ఎన్నో అడిగాడు!

నువ్వు రచయిత్రివని తెలిశాక యింకెంత సంబర పడ్డాడనుకున్నావ్?

" అంతక్లోజ్ ఫ్రెండ్ - ఇంత క్లోజ్ ఫ్రెండ్ అని చెప్పుకోవటమేగానీ ఒక్క సారైనా మనింటికివచ్చిందేమిటి? బోడి గొప్పలు!" అంటూ ఒకటే ఉడికించాడనుకో..

చివరికి ఉండబట్టలేక "ఈ సారి సంక్రాంతి సెలవుల్లో తనను తీసుకరాకపోతే నా పేరు రజితే కాదు" అని ప్రతిజ్ఞ చేశాను.

వాడి దగ్గర ఓడిపోవడం నాకిష్టం లేదు. నాక్కూడా ఎప్పట్నుంచో నిన్ను మా వూరికి తీసుకెళ్ళాలనే వుంది ! ఎలాంటి కుంటి సాకులు చెప్పినా వూర్కోను ! అడ్వాన్సుగా మామ్మ పర్మిషన్ తీసేసుకో !

ఇంకో అయిదు రోజుల్లో మళ్ళీ మనందరం మన గూటికి చేరుకుంటామన్న విషయం గుర్తుకొస్తే చాలు...ఎంత హాయిగా వుందో తెలుసా ?

నీ ఉత్తరానికి ఎదురుచూస్తూ ....

**- నీ రజిత**

❋❋❋❋❋❋

**ప్రియ బాంధవీ జయా,**

ఎలా వున్నావ్ ? నీకేం బాగానే వుంటావ్ !ఎవరికీ అందకుండా పాదరసంలా జారిపోతూ ఎదుటివాళ్ళని వూరిస్తూ నీకేమీ పట్టనట్లు బాగానే వుంటావ్!

**డియర్ జయా!,**

నీ అందాల మోము చూస్తూంటే సృష్టి గురించి ఒక్కోసారి నా కెన్ని కొత్త సందేహాలు పుట్టుకొస్తుంటాయో - మరోసారి అదే ముఖాన్ని చూస్తూంటే నా మదిలో మెదిలే ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు కూడా లభిస్తూ ఉంటాయి.

నిన్ను చూస్తూంటే ఇదివరకు నాకేమనిపించేదో తెలుసా - నేను నీలా ఓ రచయిత్రినే అయితే నీ మీద కొన్ని కావ్యాలల్లేదాన్నని ! కనీసం ఓ శిల్పినైనా అయ్యుంటే నీ చక్కటి విగ్రహాన్ని చెక్కి శాశ్వతంగా నా దగ్గర ఉంచుకునే దాన్నని!

కానీ ఇప్పుడా ఉద్దేశ్యం లేదు నాలో! - ఎందుకో చెప్పనా? నీ అకర్షణా, అందం, వ్యక్తిత్వాన్నీ కొలిచేవి ఈ ప్రపంచంలో ఏదీ లేదనీ, ఎందులోనూ నీ అసలు మూర్తిని చిత్రించలేననీ !

మా ఆడవాళ్ళనే ఇంత ఆకర్షించే నువ్వు... మగవాళ్ళని కనీసం ఊపిరి అయినా తీసుకోనిస్తావా? ఇంతటి రత్నాల రాశిని తన సొంతం చేసుకొనే అ అదృష్ట వంతుడెవరో గానీ - అతణ్ణి తలచుకుని ఈర్ష్యపడ్డ క్షణాలు కూడా లేకపోలేదుః

దేవుడు మరీ పక్షపాతి సుమా - లేకపోతే అందం, చదువూ, ఆకర్షణా, కళారాధన, మంచితనం.... ఇన్ని సుగుణాలనూ నీ ఒక్కదానికే ప్రసాదించి... కొందరికి ఏమీ ఇవ్వడెందుకూ?

అరుణా, రజితా, చేగోడీ వగైరా మన మిత్ర బృందం బహుశః ఈపాటికి నీకు లెటర్స్ రాసే వుంటారు ! అందరికీ రిప్లయి ఇవ్వడం నీకు సాధ్యం కాకపోవచ్చు. కానీ ఏ ఒక్కరికీ నువ్వు వుత్తరం రాయకపోయినా వాళ్ళు చాలా డిజప్పాయింట్ అవుతారు! ఇలాంటప్పుడు నీ మీద మా అందరికీ జాలి కలిగినా - స్వార్థమనేది ఒకటుంది చూశావూ - అది మమ్మల్ని సరిపెట్టుకోనీదు !

విత్ లవ్.

నీ నిమ్మీ

ఆ రోజు పోస్టులో వచ్చిన రజిత, నిర్మల, చేగోడీ ఉత్తరాలను చదువుతోన్న జయని అడిగింది మామ్మ: "ఎక్కడినుండే ఆ ఉత్తరాలు?"

"రజితావాళ్ళ నుండి మామ్మా"

" ఏదీ... మొన్న సెలవుల్లో మనింటికి వచ్చిన పిల్లేనా? ఏం రాసిందేమిటీ?"

"నన్నీసారి సంక్రాంతి సెలవుల్లో వాళ్ళంటికి రమ్మని రాసింది."

"అలాగా ?"

"వెళ్ళనా మరీ " ఆశగా అడిగింది జయ .

"వద్దంటే వూర్కుంటావుటే ! వెళ్ళు, ఇంతకీ ఎన్ని రోజులిస్తారు సెలవులు?"

"ఓ వారంరోజు లిస్తారేమో ?"

" సరే - ఆ వారం రోజుల భాగ్యానికి... మళ్ళీ ఇక్కడికి రావడం దేనికి? అటూ ఇటూ తిరక్కుండా - వుండేదేదో వాళ్ళింట్లోనే వుండు!"

"మా మామ్మ మంచిది!" చిన్న పిల్లలా సంతోషంతో మామ్మ చేతిమీద ముద్దెట్టుకుంది జయ.

❋❋❋❋❋❋

కాలేజీ తెరిచారు.

అందరూ హాస్టల్‌కి వచ్చేశారు. జయకి అనుకోకుండా జ్వరం తగిలి - హాస్టల్‌కి రావడం ఓ రోజు లేటయింది !

ఆ ఒక్క రోజు... ఎన్ని ప్రాణాలు ఎంతగా తల్లడిల్లి పోయాయో , ఎంత మంది

ఎన్ని సార్లు గేట్ దగ్గరకి వచ్చి, వచ్చిపోయే రిక్షాలను చూస్తూ నించున్నారో ఆ దేవుడికే తెలియాలి.

ఆ మర్నాడు సాయంత్రం గానీ వాళ్ళ నిరీక్షణ ఫలించలేదు. జయ అంత దూరాన వుండగానే ఎవరో చెప్పారు జయ వస్తోందీ అని ! అందరి గుండెలు సంతోషంతో ఒక్క క్షణం అదోలా అయిపోయాయి.

జయని చూడగానే " ఓ" అంటూ ఒక్కొక్కరే పరిగెత్తుకొచ్చి కావిలించుకున్నంత పనిచేశారు.

డాబా మీద నుంచి చూస్తోన్న కొందరికిది అదో చోద్యంగా కన్పించి చాటుగా నవ్వుకున్నారు.

అంత సంతోషంలోనూ అరుణ మాత్రం ఆ విషయాన్ని గమనించి: "ఓహో ! మీ సంగతి ఇలా వుందా ? సరే, మీ పని పట్టకపోతే నా పేరు అరుణే కాదు." అనుకుంది.

ఆ రాత్రి స్టడీ అవర్స్ అయిపోయాక బాత్‌రూం నుంచి తన రూంకేసి వెళ్తోన్న రజితకి కారిడార్లో బాత్‌రూం వైపు వస్తోన్న జయ ఎదురైంది.

" మీ వూరినుండి వచ్చాక నువ్వు నాతో మాట్లాడలేదన్న సంగతి నీకు గుర్తుందా అసలు?"

" ఎందుకు లేదూ, వుంది"

"మరెందుకు వచ్చి మాట్లాడలేదు?"

" ఏమో - అలా పలకరించాలని... నాకు తోచలేదు!"

" ఏమ్మనిషివే నువ్వు?" విస్తుపోయింది రజిత.

" పోనీ నా స్నేహం నీకు సంతృప్తి లభించడం లేదా?" అడిగింది రజిత

"లేదని నేనన్నానా?"

"మరి, నువ్వు నిర్మలతోకూడా ఎందుకంత ఫ్రెండ్లీగా వుంటున్నావ్?"

"ఉంటే తప్పా?"

"అలాంటప్పుడు మరి నేనెందుకూ?"

"అంటే....."

" రచయిత్రివి! ఇంకా అర్థంకాలేదా? నన్ను మించిన స్నేహితురాలు... నీకింకొకరు వున్నప్పుడు ఇక నాకున్న విలువేమిటీ?"

"తను నాతో అంత ఫ్రెండ్లీగా మూవ్ అవుతున్నప్పుడు.... నేను దూరదూరంగా ఎలాపోను ?"

"నేనూ - అరుణా - వీళ్ళంతా చాలరా జయా ? ఇంకా కొత్త కొత్త వాళ్ళతో కూడా ఫ్రెండ్షిప్ ఎందుకూ?"

"ఏమో రాజీ, నువ్వెంత నన్ను ఇష్టపడ్తున్నావో... నిర్మల కూడా నన్నంతే యిష్టపడ్తోంది, అలాంటప్పుడు అమెనెలా కాదనాలి ?"

"అయితే ఇలా నిన్నిలా ఇష్టపడ్తున్నామని ఎంతమంది వస్తే అంత మంది ఫ్రెండ్స్‌నీ ఆదరిస్తావా?"

" స్నేహితులకు లిమిట్ వుంటుందా రాజీ?" జయ ప్రశ్న కంటే - ఆమె అడిగే తీరులో అమాయకత్వం కన్పించింది రజితకి.

"ఆఫ్‌కోర్స్, వుండవచ్చూ - ఉండకపోనూవచ్చు! అది ఆయా వ్యక్తుల అభిప్రాయాలని బట్టి వుంటుంది! కాని నా భయమల్లా ఒక్కటే ! ఇలా నిన్నిష్టపడే వాళ్ళందర్నీ నువ్వు చేరదీస్తూ వుంటే - ఎవరికీ సంతృప్తి కల్గించకపోగా అందరి హృదయాలనూ క్షోభ పెట్టినదానివవుతావు ! మోరోవర్ నువ్వు ఎదుటి మనుషుల్ని ఇట్టే నమ్మి, ఫ్రెండ్షిప్ చేస్తావు ! అదెప్పటికైనా నిన్ను ఎదురుదెబ్బతీస్తుందేమో?"

" ఏమో రాజీ, నన్ను కావాలని నా దగ్గరకి వచ్చేవాళ్ళని దూరం నెట్టేసేంత కఠిన హృదయం నాకివ్వలేదు దేవుడు! నన్ను క్షమించు!" అంటూ వెళ్ళిపోయింది జయ.

" ఇలా ఎదురైనవాళ్ళ హృదయాలనల్లా దోచుకుంటూ పోతే - వాటి నెక్కడ భద్రపరుచుకోవాలో తెలీక ఉక్కిరి బిక్కిరైనపుడుగానీ - నేను చెప్పిన మాటలు నీకు అర్థంకావు జయా! ఇంత చిన్న చిన్న విషయాలే తెలీని నువ్వు - నీలోని ఏ ఆకర్షణతో ఇంత మందిని కట్టి పడేస్తున్నావ్?" కారిడార్ స్థంభాన్నానుకొని అలాగే ఆలోచిస్తూ నించుండిపోయింది రజిత.

❋❋❋❋❋❋

"జయా, జయా " పరుగెత్తు కొచ్చింది చేగోడీ.

"ఏమిటీ ? "

" ఆ కమల లేదూ?"

" లేకేం ? నిక్షేపంలా వుంది ?"

" ఛ - పోవే ! నీకెప్పుడూ వెటకారమే ! అది కాదే - అమెకి, ఆమె అణువ ణువునూ వర్ణిస్తూ ఎవరో లవ్‌లెటర్ రాశారట! ఎదురైన వాళ్ళందరికీ చెప్పుకుని తెగ సంబరపడిపోతోంది"

" ఎవరూ - నిన్న మనల్ని చూసి నవ్విన అమ్మాయేనా?" నిదానంగా అడిగింది అరుణ.

" ఆ ! ఆ అమ్మాయే ! ఆవిడకు లవ్ లెటర్ రావడమేమిటోగానీ ముఖం ట్యూబ్ లైట్లా వెలిగిపోతోందనుకో !?"

"బహుశః ఎప్పుడూ వచ్చివుండదు ! అదీకథ!" తేలిగ్గా అంది నిర్మల.

"ఇంతకీ ఏం రాశాడట - ఈ సుందరాంగి గురించి ?" అరుణ ప్రశ్న.

" నాకేం తెలుసూ? నేనడిగానా?"

" మనం వెళ్ళి అడుగుదాం పద" లేచింది అరుణ.

"లవ్ లెటర్ రావడం ఓ వింతైనట్టు... ఏమిటీ వెర్రిపనులు"? కసిరింది రజిత.

“ నీకూ - నాకూ కొత్త కాకపోవచ్చు ! కాని ఆ అమ్మాయికది కొత్త ! అదీ వింత?” అంది చేగోడీ.

“మనం వచ్చామని తెలిసి - ఇహ కొండెక్కి కూర్చుంటుందేమో ?” రజిత అనుమానం.

“మనం కిందకి తోసేద్దాంగానీ - ఎలా చెప్తుందో విందాం పదవే !” అంది జయ ఉత్సాహంగా.

అందరూ కలిసి మూకుమ్మడిగా కమల దగ్గరకు వచ్చారు ! కమల పార్టీ వాళ్ళూ, చంద్రపార్టీ వాళ్ళూ, జయ పార్టీ వాళ్ళూ అంతా సమావేశమయ్యారు! లవ్‌లెటర్స్ రావడం కాలేజీలో కొత్త గాకపోయినా - సాధారణంగా వాటిని అంతగా పట్టించుకునే నాథుడెవరూ ఉండరు !

అలాగాక - ఇప్పుడు కమలే స్వయంగా తనకొచ్చిన లవ్‌లెటర్ గురించి అందరికీ ‘టాంటాం’ చేయడంతో - ఆమె ఏం చెప్తుందో వినాలన్న కుతూహలంతో - అందరూ కలిసికట్టుగా వచ్చి, అడగడం మొదలెట్టారు.

“పోస్ట్‌లోవచ్చిందా?” జయ అడిగింది.



“ లేదు. కాలేజీ నుండి వచ్చేసరికి నా రూంలో పడివుంది.?”

“ రూంలో పడివుందా? ఎలా వచ్చిందిక్కడికి?” ఆశ్చర్యపోతూ అడిగింది చంద్ర.

“బహుశః ఆ అబ్బాయి - ఎవరైనా డేస్కాలర్ అమ్మాయితో పంపించాడేమో?” అంది కమల.

‘‘ఇంతకీ ఏం రాశాడేమిటీ ఆ లెటర్లో?’’ కుతూహలం కనపరిచింది చేగోడీ.

వినేవాళ్ళెప్పుడూ చెప్పేవాళ్ళకు లోకువ అన్నట్లు- దొరికిందే ఛాన్సని లెటర్లో వున్నదంతా చదువుతూ, మధ్య మధ్య కొన్ని లేనివి కూడా కల్పిస్తూ ఎంతో రమ్యంగా చెప్తోంది కమల.

“ అసలు వాడికి కళ్ళున్నట్టులేదు! ఉంటే... నీ తుమ్మ మొద్దు శరీరాన్ని గురించి అంతగా వర్ణించడు!” గొణిగింది నిర్మల వెనకాల.

ఇక వినే ఓపిక లేక అడిగింది చంద్ర : “ ఇంతకీ అతడి పేరేమిటిట?”

కమల సమాధానం చెప్పబోయేంతలో... అరుణ అడ్డొస్తూ: “లెట్మీ టెల్ హిజ్‌నేం కమలా! హీ ఈజ్ రవి ! ఎం.బి.బి.యస్ ఫస్టియర్. ఇజిట్ నాట్ కమలా?” అడిగింది.

“అవునూ ! అతడేనని నీకెలా తెలుసూ?” మెరిసే కళ్ళతో ఆశ్చర్యంగా అడిగింది. కమల.

సమాధానం చెప్పకుండా పెద్దపెట్టున నవ్వి - లేచి నించుంది అరుణ.

జయా రజితా ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు అర్థంగాక.
" నీముఖానికి లవ్‌లెటర్ ఒకటే తక్కువైంది! ఆ లెటర్ రాసింది ఎవరోకాదు! నేనే! ఎందుకు రాశానో తెలుసా? నిన్నిలా నలుగుర్లో ఇన్సల్ట్ చేసి - తద్వారా నీకు బుద్ధిచెప్పడానికే ! నాకు మొదట్నుండీ నీ సంగతి పూర్తిగా తెలుసు! ఎవరు ఎవర్తో క్లోజ్‌గా వున్నా నువ్వు ఓర్వలేవు! ఎవరైనా ఇద్దరు అతి సన్నిహితంగా వుంటే- వాళ్ళు ప్రేమపక్షులనీ, అదనీ - ఇదనీ - ఏదేదో రిలేషన్‌షిప్ అంటగడ్తావ్! నిన్నటికి నిన్న.... జయ వచ్చిందన్న సంతోషంతో వెళ్ళి జయని వాటేసుకుంటే - డాబా మీద నుండి కిసుక్కున నవ్వుతావా? ఇప్పుడు నిన్ను చూసి ఎంతమంది నవ్వు తున్నారో చూడూ ! బాగా చూడూ ! చూసి బుద్ధి తెచ్చుకో ! మిస్ కమలా - ఎదుటివాళ్ళ చీరలనీ, నగలనీ, అందాన్నీ, పై మెరుగుల్ని చూసి ఫ్రెండ్షిప్‌చేసే నీలాంటి వాళ్ళకు మా ఫ్రెండ్షిప్ అర్థంకాదు!" అంటూ కూర్చుంది అరుణ.

"ప్రొసీడ్ - ప్రొసీడ్!" చప్పట్లుకొట్టారు కొందరు.

రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ లేవబోతున్న అరుణ భుజాలని - అదిమిపట్టి కూర్చోబెట్టింది జయ.

"టిట్‌ఫర్ టాట్, లెట్ హర్ ప్రొసిడ్ జయా!" అరిచారు కొందరు.

" నో... నో.... నో ! ఇట్ డజంట్ లుక్ నైస్ ! ప్లీజ్ కీప్ క్వయట్ " అంది జయ.

కమల తల భూమిలోకి క్రుంగిపోయింది.

❋ ❋ ❋ ❋ ❋

"జయా, మన ట్రాన్సిస్టర్ వచ్చిందేవ్?" విజిటర్స్ రూంలోంచి కేకేసింది రజిత.

జయ కళ్ళు తళుక్కుమన్నాయి !

" ట్రాన్సిస్టర్ వచ్చిందట! పద, మన రూంకి తీసుకొద్దాం!"

నిర్మల చేయిపట్టుకుని విజటర్స్ రూంకి పరుగుతీసింది జయ.

"రూమ్‌కి రాకుండా, ఇక్కడ కూర్చున్నావేమిటే ?" వెళ్తూనే ఒకమ్మాయిని కావిలించుకున్నంత పనిచేసింది జయ.

"అహఁ నామీద ఎంత ప్రేముందో - పరీక్షిద్దామనీ ?..."

"అంటే....."

"అదేనే... నువ్వు నన్ను వెతుక్కుంటూ వస్తావో రావో చూద్దామనీ."

నిర్మలకేమీ అర్థంగాక అటూ ఇటూ చూస్తూ - ఇబ్బందిగా నిలబడింది.

"అయాం సారీ నిమ్మీ - పరిచయం చేయడం మరిచాను ! ఈవిడే ట్రాన్సిస్టర్! మనల్ని విడిచి వుండమన్నా వుంటుందిగానీ - క్షణం కూడా ట్రాన్సిస్టర్ని వదిలి పెట్టదు! అందుకని ముద్దుగా దీన్ని ట్రాన్సిస్టరంటాం ! అద్సరేగానీ - ఈసారి నువ్వు నీతో ట్రాన్సిస్టర్ని తెచ్చుకోలేదేం? విడాకులుగానీ ఇచ్చావేమిటీ?" అడిగింది జయ.

" రిపేర్‌కిచ్చాను." అంది ట్రాన్సిస్టర్ నవ్వుతూ.

"అలా చెప్పు ! ట్రాన్సిస్టర్ పాడయితే గానీ - మేం గుర్తురాలేదన్నమాట నీకు!" అంది జయ బుంగ మూతి పెడ్తూ -

" ఛ. పోవే ! ఆ వెధవ ట్రాన్సిస్టర్‌కీ - నీకూ పోలికేమిటీ ?"

" అవునుగానీ - ఈ మధ్య రేడియోలో వస్తోన్నవన్నీ మీ కిషోర్ కుమార్ పాటలే!" అంది అరుణ ఉడికిస్తూ.

"వాడెవడినో పట్టుకుని నా కిషోర్ అంటావేమిటీ ?" అంది ట్రాన్సిస్టర్ ఉడుకు మోత్తనంతో.

"ఏదీ, నువ్వేనా ఆ మాట అంటోంది?" నమ్మలేనట్లుగా చూసింది రజిత .

ట్రాన్సిస్టర్ నవ్వింది.

రేడియోలో కిషోర్ గొంతు విన్పిస్తే చాలు, 'కిషోర్ ! మై డాళింగ్' అంటూ రేడియోని కావిలించుకున్నంత పనిచేసేది!

అతడి పాటలు ఎక్కడ మిస్సవుతాయో అని ఎక్కడికి వెళ్ళినా, చివరకు బాత్రూం కైనాసరే ట్రాన్సిస్టర్ని పట్టుకెళ్ళేది!

మొదట్లో 'నీ మంగలి పెట్టె ఏద'ంటూ వేళాకోళం చేసినా - రానురానూ వీళ్ళూ అలవాటు పడిపోయారు !

వీళ్ళకి ఆమె పీ.యూ.సీ.లో క్లాస్‌మేట్. ఆ సంవత్సరం వేసవి సెలవుల్లో ఆమె పెళ్ళిలో - ఆమెకి ట్రాన్సిస్టర్నే బహూకరించారు హాస్టల్ పిల్లలు! అంతే! అప్పుడు వెళ్ళిన ట్రాన్సిస్టర్ ఒకటిన్నర సంవత్సరం తర్వాత - మళ్ళీ ఇదే రావడం!

" అయితే మనిషి బాగా మారిపోయిందన్నమాట?" అంది అరుణ.

"మారిపోకుండా ఇదింకా ట్రాన్సిస్టర్నే కావలించుక్కుర్చుంటానంటే - దీని మనోవల్లభుడూర్కోవద్దుటే?" అంది రజిత కొంటెగా.

"ఇంతకీ అతడికి పాటలు పాడ్డం వచ్చా?" అడిగింది జయ.

"కిషోర్ కుమార్లా పాడ్తాడా?" గుసగుసలుగా అడిగింది అరుణ.

"నిన్ను క్షణం కూడా వదిలిపెట్టకుండా వుంటాడా?" జయ ప్రశ్న.

"పొండే!" సిగ్గుపడింది ట్రాన్సిస్టర్.

ఆ రెండు మూడు రోజులూ వాళ్ళతో ఎంజాయ్ చేసి వెళ్ళిపోయేముందు అంది ట్రాన్సిస్టర్: " చెట్టు కొకరం పుట్టకొకరం కాకుండా - కాలం ఇక్కడే స్థంభించిపోతే- ఎంత బావుణ్ణు ! కాని అదెలా సాధ్యం ? ఈ మధురస్మృతులు నెమరేసుకోవడం తప్ప మనం చేసేదేమీ లేదు !..."

******

కాలం గడుస్తూన్న కొద్దీ చంద్ర స్వభావంలో చాలా మార్పు వచ్చింది ! ఇది వరకు జయ పట్ల అంతమంది ఆకర్షితులవుతూంటే - ఆ పిల్లలో ఏముందని వీళ్ళింతగా ఆరాటపడ్తారు - అనుకునే చంద్ర కూడా - ఇప్పుడు వాళ్ళలో జతయి పోవడం చాలామందికి ఆశ్చర్యాన్ని కల్గించింది.

“ జయా... ఆ...ఆ...ఆ...” గారాలు పోతూ వచ్చింది అరుణ.

“ ఏందమ్మా - ఏం కావాలీ?” అడిగింది జయ వెక్కిరింతగా.

“ మనిద్దరం పెళ్ళి చేసుకుందామే!? ”

“ ఏయ్, ఏమిటీ పిచ్చివాగుడు?”

“ ఏమన్నా అనుకోగానీ, మనిద్దరం వెళ్ళి రిజిష్టర్ మారేజీ చేసుకుందాం!”

“ఉండుండీ - నీకివాళ ఇదేం బుద్ధి పుట్టిందే!”

“భవిష్యత్ గురించి ఆలోచిస్తొంటే బెంగపట్టుకుందే చిట్టితల్లీ! ఏం చేయమంటావ్?”

“ఎందుకో”?

“ ఈ సంవత్సరమైపోతే - నీదో దారీ నాదో దారీ ! మళ్ళీ మనమిలా కలిసి బతికే అవకాశం ఎక్కుడుందే? అందుకనీ...”

“ ఊఁ అందుకని... నన్ను పెళ్ళి చేసుకోమంటావ్ ?”

“మరి, మనిద్దరం ఎప్పటికీ కలిసి వుండడానికింకో మార్గం లేనప్పుడు - ఇంత కన్నా చేసేదేముంది!?”

“ పోనీ - ఇద్దరూ కలిసి ఒక్కణ్ణే పెళ్ళాడండీ!” సలహా ఇచ్చింది నిర్మల.

“ మా మధ్య మూడో వ్యక్తి ప్రవేశించరాదనే కదా - మేమిద్దరం పెళ్ళాడ్డామను కుంటోంది.” అంది అరుణ.

“హుఁ చేసుకోక - చేసుకోక - నిన్నే చేసుకోవాలి!”

“వాడ్డుయు మీన్?” రుద్ర కాళిలా లేచింది అరుణ.

“అదో, ఇంత గంపగయ్యాళిని పెళ్ళి చేసుకుంటే ఇక నేను బతికి బట్టకట్టినట్టే! అటు నిర్మలతో మాట్లాడవద్దనీ - ఇటు రజితని పలకరించకూడదనీ - ఒకటేమిటీ సవాలక్ష ఆంక్షలు విధించి, నన్ను కట్టిపారేస్తావ్ బాబోయ్, నాకీ పెళ్ళాం వద్దు!” అంది జయ

ఫక్కుమన్నారందరూ. అరుణకూడా నవ్వేసింది.

“ అయినా నాకు తెలీక అడుగుతాను ! అసలు ఆడవాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటే తప్పేమిటట ?” మళ్ళీ మొదటి కొచ్చింది అరుణ.

“ తప్పని ఎవరన్నారోయ్!”

“ మరి నేను చెప్తే ఎందుకలా కొట్టి పారేస్తున్నారు. ప్చ్! ఏమిటో ఈ మనుషులూ, ఈ సమాజం ! ఈ సంకుచిత బుద్ధి మాని, ఎప్పుడు బాగుపడ్తారో ఏమిటో ?” అంది అరుణ పెదవి విరుస్తూ కొంటెగా.

గొల్లు మన్నారు పిల్లలు.

ఆ సంక్రాంతి సెలవుల్లో రజిత జయని తన ఇంటికి తీసుకెళ్ళింది. ఇంట్లో వాళ్ళని కూడా బాగా ఆకర్షించింది జయ. రజిత తమ్ముడూ చెల్లెలైతే సరేసరి- జయనే అంటి పెట్టుకుని క్షణం వదిలేవాళ్ళు కారు !

"ఏయ్ మాగ్నెట్! ఎదురైన ఇనుప ముక్కలన్నింటినీ నీ వైపుకు ఇలా ఆకర్షించుకుంటూంటే చివరికి అవన్నీ నిన్నే కన్పించనీకుండా చుట్టుముడ్తాయి! జాగర్త!" అంది రజిత నవ్వుతూ.

"ఎంత నెమ్మదీ - ఏం కథా ! చదువుకున్న వాళ్ళలో ఇంత అణుకువగా వుండే అమ్మాయినే చూళ్ళేదు!" అంది రజిత వాళ్ళమ్మ.

"నేతి బీరకాయలో నెయ్యి వుండటం ఎంత నిజమో, జయలో నెమ్మది వుండటమనేది అంత నిజం ! ఏదో మీరు కొత్త వాళ్ళు కదా అని మీ ముందు ఇలా ఉంటోంది గానీ, నిజానికి దానంత అల్లరి పిల్ల ఇంకెవరూ వుండరు!" అని రజిత చెప్తూంటే నమ్మలేనట్లుగా చూసింది వాళ్ళమ్మ.

వాళ్ళు వచ్చాక మూడో రోజునే వినోద్ వచ్చాడు !

రజిత ఎదురెళ్ళి బ్రీఫ్ కేస్ అందుకుంది ! అతడి కళ్ళు దేనికోసమో వెతుకుతున్నట్లు గమనించి, నవ్వుతూ అంది రజిత: "జయ వచ్చిందిలేరా..."

రజిత తన మనసులోని భావాలు పసిగట్టినందుకు సిగ్గుపడ్డాడు వినోద్.

స్నానం చేయడానికి వెళ్ళబోయే ముందు అన్నాడు వినోద్: ""చూడు రాజీ - ఫ్రెండ్ గొడవలో పడి నన్ను మరిచిపోకేం ? నీ కంపెనీ లేకపోతే నాకేమీ తోచదు - కాబట్టి, మధ్య మధ్య వచ్చి మాట్లాడిస్తూ వుండు."

" అబ్బ ! ఉండుండీ నా మీద నీకెంత ప్రేమ పుట్టుకొచ్చిందిరా చిట్టి తండ్రీ! ఎదురుగా ఎంతమంది మనుషులున్నా - ఎవర్తోనూ మాట్లాడకుండా - పుస్తకాల్లో తల దూర్చే నీకు - ఈరోజు తోచట్లేదంటే ... అంటే .. ఆ 'కథ' లో... ఏదో... మతలబు...వుండే వుంటుంది!" కొంటెగా వినోద్ వంక చూస్తూ అంది రజిత.

"సంతోషించానుగానీ - వెళ్ళి నీ ఫ్రెండ్‌తో కబుర్లు చెప్పుకోమ్మా - నేనీలోగా జలకాలాడి వస్తాను!" నవ్వుతూ బాత్‌రూమ్‌లో దూరాడు వినోద్.

ఆరోజు మధ్యాహ్నం భోజనాల దగ్గర - యిద్దరూ ఒకరికొకరు ఇదివరకే పరిచయం కాబట్టి - వాళ్ళే మాట్లాడుకుంటారేమో అనుకుంది రజిత.

కాని ఇద్దర్లో ఎవరూ అలాంటి ప్రయత్నమే చేయకపోవడంతో - వాతావరణం బరువుగా తోచి: "షి ఈజ్ మై ఫ్రెండ్ జయ!" అంటూ పరిచయం చేసింది రజిత.

" అహఁ అలాగా ! ఈ ఎంగిలి చేత్తో నమస్కారం పెట్టమంటారా ?" అడిగాడు వినోద్ నవ్వుతూ...

జయ నవ్వింది.

"కొత్త పెళ్ళికూతుర్లా ఈ సిగ్గేమిటే ? నీ కొంపలేం అంటుకోవుగానీ కాస్త తలెత్తి చూడుతల్లీ ! ఒరేయ్ అన్నయ్యా, ఈవిడకు మీ మగపురుగులతో అంతగా పరిచయం లేదు కాబట్టి - కాస్త జంకుతోంది! నీకేమైందిరా మాట్లాడ్డానికి ? నువ్వైనా పలకరించొచ్చుకదా ?" అంది రజిత.

" ఏయ్ ఛాటర్ బాక్స్ ! మాట్లాడేదేదో తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చుగానీ- ముందు మీ ఫ్రెండ్‌ని భోంచేయనీయ్ ! పాపం, ఆవిడకు బాగా ఆకలేస్తుందిలా

వుంది! మాట్లాడకుండా గబగబా తినేస్తున్నారు!" అన్నాడు వినోద్ ఓరగా జయ వంక చూస్తూ.

మరుక్షణం జయ చేయి వణికి, చేతిలోని ముద్దజారి ప్లేట్లోపడి, కొన్ని మెతుకలు చెదిరి వినోద్ ప్లేట్లో పడ్డాయి !

"సారీ" అంది జయ నొచ్చుకుంటూ:

"రాజీ, ఆ ప్లేట్ తీసేసి వేరే ప్లేట్ పెట్టు మీ అన్నయ్యకు!" చెప్పింది జయ.

"ఇట్సాల్ రైట్!" అంటూ ఆ ప్లేట్ తీసేయకుండా అందులోనే పెరుగు కలుపుకుని అన్నం తినేశాడు వినోద్.

జయ మాత్రం జరిగిన సంఘటనకు సిగ్గుతో కుంచించుకుపోయింది.

ఆ సాయంత్రం షికారుగా - కాలువ గట్టెమ్మట నడిచి, వాళ్ళతోటలో అడుగెట్టారు ముగ్గురూ. వినోద్ ఆ తోటలో పండే పంటల గురించీ, కాసే కూరగాయల గురించీ చెప్పుకుపోతున్నాడు.

ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకుని కొన్ని చెఱకు గడలు కోసుకుని ఓ చోట కూర్చుని తినడం మొదలెట్టారు.

జయకి వాటినెలా తినాలో మొదట్లో తెలీలేదు. రజిత చెఱకు గడ పైచెక్కుతీసి చిన్న చిన్న ముక్కలు చేసి - జయకి ఎలా తినాలో చూపించింది.

జయ సిగ్గుపడ్తూ రెండు ముక్కలకన్నా ఎక్కువ తినలేకపోయింది.

"ఏదైనా ఓ పాట పాడండీ?" అడిగాడు వినోద్ జయని.

"నాకా - ఎబ్బే, రావండీ" అంది తడబడ్తూ

"వచ్చినవాళ్ళెప్పుడూ అలాగే అంటారు గానీ - ప్లీజ్ పాడండీ!"

" ఈ జలుబు కంఠంతో ఇప్పుడు సరిగా పాడలేనేమో ?" అంది జయ సంశయిస్తూ.

"ఫర్వాలేదు ! ఇదేం పాటలపోటీ కాదుగా - మీకు మార్కులు రావని భయపడటానికి! ఎట్‌లీస్ట్... మీరిప్పుడు చెరుకుగడ తిన్నందుకైనా మీ కంఠం తీయగా పలుకుతుంది లెండి?"

' భలే చమత్కారంగా మాట్లాడ్తాడీ మనిషి?' అనుకుంది జయ.

రజిత కూడా బలవంతం చేయడంతో పాట పాడటం తప్పలేదు జయకి.

"మ్రోగించకోయ్ మురళీ .. మ్రోగించకోయ్ కృష్ణా?" తనకిష్టమైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి పాట అందుకుంది జయ.

"ఎలా పాడిందిరా?..." రజిత భుజాలు పట్టుకుని ఊపితేగాని వూహాలోకంనుంచి దిగి రాలేదు వినోద్

"కేవలం బాగా పాడింది అంటే అమె కంఠాన్ని చిన్న బుచ్చినట్టవుతుందేమో? అంతకన్నా బావుండే యింకోమాట ఏది చెప్తే - ఈ గాన కోకిలకి సరిపోతుందా అని ఆలోచిస్తున్నాను!" అన్నాడు వినోద్.

"మీరు వెక్కిరిస్తున్నట్టున్నారు!" అంది జయ

"లేదు జయా, నేను నిజమే చెప్తున్నాను. నాకు పొగడ్తలూ, వెక్కిరింతలూ తెలీవు!"

"ఇఫ్‌సో థాంక్యు వెరీమచ్!" అంది జయ

ఆరోజు రాత్రి తృప్తిగా పడుకున్న వినోద్‌కి జయ కలలోకి వచ్చి కలవరపెట్టింది. మర్నాడు పొద్దున ఎనిమిదైనా ఇంకా జయ లేవకపోవడంతో వెళ్ళి దుప్పటి లాగేసింది రజిత.

" అబ్బ ! కాస్సేపు పడుకోనీవే" మత్తుగా అటు దొర్లింది జయ.

"పొద్దెక్కే దాకా పడుకుంటే - అమ్మకి నచ్చదు! నీయిష్టం మరి!" ఆయుధాన్ని ప్రయోగించింది రజిత.

"ఈజిట్ ?" దిగ్గునలేచి కూర్చుంది జయ.

కాఫీ తాగుతున్నప్పుడు అడిగింది రజితా వాళ్ళమ్మ: "అప్పుడే లేచారేమమ్మా ఇంకాసేపు పడుకోకపోయారా? నిన్నంతా చేలల్లో తిరిగి అలసిపోయుంటారు."

"దొంగా! ఇది నీపనా?" అన్నట్లు జయ చురుక్కున చూసింది రజిత వంక.

రజిత నవ్వింది.

"ఏ కొంచెం అలుసు ఇచ్చినా - ఈ రాణీగారు మధ్యాహ్నం దాకా ముసుగుతీసే రకం కాదమ్మా?" అంది.

" మీ అన్నయ్యకు పాటలుపాడ్డం వచ్చునుకుంటా?" రమణమ్మ అటు వెళ్ళగానే అడిగింది జయ.

"అవును ! కానీ, నీ అంత బాగా పాడ లేడులే ! ఇంతకీ నువ్వెలా గెస్ చేశావ్?"

"అతడి కంఠం వింటూంటే తెలీటంలా? చాలా మధురంగా వుంటుంది! మగాళ్ళలో నేనసలు ఇలాంటి కంఠాన్ని ఇంతవరకూ విన్లేదు"

" బండి... పట్టాలు తప్పిపోతోన్నట్టుందే !" అంది రజిత చిలిపిగా .

"ఏమిటీ, ఏమంటున్నావ్ ?" - అమాయకంగా అడిగింది జయ.

రజిత నవ్వి అంది: " ఇది చెప్పు ! అన్నయ్యపట్ల నీ ఉద్దేశమేమిటి?"

" సహృదయుడిలా అవుపిస్తాడు."

" గుడ్ ! అయితే ముహూర్తం పెట్టించమంటావా?"

" ఏయ్, ఏమిటీ పిచ్చివాగుడు!"

" మరి అన్నయ్య నచ్చాడుగా నీకు. "

" తెలివికి సంతోషించానుగాని నోర్మూసుకో ! మీ అన్నయ్యని మెచ్చుకున్నంత మాత్రాన ఇలాంటి ఊహాగానాలు చెయ్యక్కర్లేదు!"

(సశేషం)

**ఆంధ్రజ్యోతి వార పత్రిక 18-3-1977**